# పావలా

– రావిపల్లి నారాయణరావు

యాభైయైదు సంవత్సరాల క్రిందట–
మనదేశాన్ని స్వాతంత్ర్యం వరించడానికి ముందు–
రెండో ప్రపంచయుద్ధం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడేరోజుల్లో, ఆకాశవీధుల్లో బారులు తీరిన విహంగాల్లా, పోటీపడుతూ విమానాలు రాకెట్లలా దూసుకుపోతున్నాయి. మండుటెండలో ఏఆర్పీ భటులు గస్తీ చేస్తున్నారు.
సైరన్ చెవిని పడగానే ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకున్న జనాలు, దారి తెన్ను కానక తలదాచుకోటానికి, రక్షణకోసం నాలుగురోడ్ల కూడలిలో కట్టిన ట్రెంచీలను వెతుక్కుంటూ పరుగులు పెడుతున్నారు.

ఈరోజు ఏం జరుగుతుందో తెలియదు. రేపటి పరిస్థితి ఎలా మారుతుందో అర్థంకాదు. ఇల్లువిడిచి రోడ్డు మీదకు వెళ్ళిన వ్యక్తి కులాసాగా మళ్ళీ యిల్లు చేరుకుంటాడన్న నమ్మకంలేదు. చేతిలో డబ్బున్నా నిత్యావసర వస్తువులు దొరుకుతాయన్న భరోసాలేదు. ఆరోజులు తలచుకోకూడదు. తలచుకుంటే గుండెల్లోని దడ వేగాన్ని పుంజుకుంటుంది. అలాంటి రోజులు మళ్ళీ రాకూడదు. ఆరోజుల్లో ఈ భూప్రపంచంలో మానవ జన్మ ఎత్తనటువంటివాడు అదృష్టవంతుడే.

సూర్యం రెండో ప్రపంచయుద్ధానికి ముందే పుట్టినా అతనికి నిజంగా ఊహ తెలిసింది ఈ యుద్ధకాలంలోనే. యుద్ధం ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో సూర్యం హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి విజయనగరానికి యిర్వై మైళ్ళ దూరాన ఉన్న ఒక పల్లెటూర్లో బడిపంతులు. ఆ ఊరికి దగ్గర్లో మంచి స్కూలు లేకపోవడంతో సూర్యాన్ని విజయనగరం పంపి ఒక హైస్కూల్లో చేర్పించారు వాళ్ళనాన్నగారు.

సూర్యం ఆ స్కూల్లో చేరి రెండు సంవత్సరాలు కాకముందే మంచిపేరు తెచ్చుకున్నాడు. ప్రతీ పరీక్షలోను మంచి మార్కులు తెచ్చుకుని తెలివైన విద్యార్థి అనిపించుకున్నాడు. అందువలన స్కూల్లో పిల్లలందరు అతనంటే ఎక్కువ ఇష్టపడతారు. అతనితో స్నేహం చేయటానికి ముందుకొస్తారు.

సూర్యం ఒక పేదకుటుంబంలో పుట్టినట్టుకాని ఆర్థికంగా అతను చాలా కష్టాల్ని ఎదుర్కొంటున్నట్టుకాని ఆ స్కూల్లో ఎవరికి తెలియదు. అతను తెలియనివ్వలేదు. అలా తెలిస్తే అతనిపై అందరూ సానుభూతి చూపిస్తారు. లేకపోతే చిన్నచూపు చూస్తారు అన్న విషయాన్ని గ్రహించిన సూర్యం ఎప్పుడూ నిండుకుండలా కనిపిస్తాడు.

పల్లెటూర్లో బడిపంతులుగా ఉద్యోగం చేస్తున్న తండ్రి నెలకు మూడు రూపాయలు సూర్యానికి పంపుతాడు. ఆ మూడు రూపాయలలో రెండు రూపాయలు నోటు బుక్కులకు, బట్టలు ఉతుక్కునే సబ్బులకు, తలనూనెకు మొదలైన ఖర్చులకు చేటాయించి మిగిలిన ఒక రూపాయి తన జేబు ఖర్చుకు ఉంచుకుంటాడు సూర్యం. వారానికి పావలా చొప్పున నాలుగు వారాలకు ఆ రూపాయిని సరిపెట్టుకుంటాడు.

ఒక ఆదివారం– ఆరోజు స్కూలు శలవు. కాని స్పెషల్ క్లాసు పెట్టారు ఇంగ్లీషు మాష్టారు. క్లాసు విడిచిపెట్టేసర్కి టైమ్ పన్నెండు దాటింది. నిప్పులను చెరుగుతోంది ఎండ. చెప్పులు వేసుకునే అలవాటు లేదు సూర్యానికి. తారురోడ్డు మీద కాళ్ళు కాలుతున్నా అలాగే యింటికి బయల్దేరాడు సూర్యం.

రోడ్లమీద ఏఆర్పీ భటులు విజిల్స్ వేస్తున్నారు. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్నారు. ఆకాశంలో విమానాల మోత. నడినెత్తిన నిప్పుల వర్షం కురిపించే సూర్యుడు. అటు ఎండ, యిటు మండే కాళ్ళు. బాధను తట్టుకుంటూ నడక వేగాన్ని ఎక్కువ చేశాడు సూర్యం. అతని గొంతు ఆరిపోతుంది. నీళ్ళు త్రాగితే ఎంత బాగుండేది. రోడ్డుకిరువైపులా కనుచూపుమేరలో ఒక్క కొళాయి కూడా కనబడలేదు. ఇంటి గుమ్మాలలో మనుషుల జాడలేదు. అంతా తలుపులు బిడాయించుకుని లోపల నిద్రపోతున్నారేమో! ఇంకో అయిదు నిముషాలు నడిస్తేనేకాని సూర్యం ఇల్లు చేరుకోలేదు. తలిదండ్రులు పల్లెటూర్లో ఉండటం వలన సూర్యం తన పిన్నిగారింట్లో ఉంటున్నాడు.

ఎండ దాటికి తట్టుకోలేకపోతున్నాడు సూర్యం. గొంతులో గ్లాసుడు నీళ్ళు పడితేకాని అతను మామూలు మనిషి కాలేడు. ఓపిక తెచ్చుకుని అలాగే నడుస్తున్నాడు. రోడ్డుప్రక్కన పెద్ద మైదానం. ఆ మైదానంలో ఒక షాపు కనబడింది. ఆ షాపులో గోలీసోడా అమ్ముతారని సూర్యానికి తెలుసు. ఆ షాపు కనబడేసరికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టు అనిపించింది. వెంటనే పేంట్ జేబులోకి చేయి పోనిచ్చాడు పావలా కోసం. ఉదయం స్పెషల్ క్లాసుకు బయల్దేరే ముందు ట్రంకు పెట్టెలో నుంచి ఒక పావలా తీసి జేబులో వేసుకున్నాడు సూర్యం. ఆ పావలా అతని జేబులో ఒక మూలకుపోయి దాక్కుందేమో హైడ్ అండ్ సీక్ గేమ్‌లా రెండు నిముషాలు వెతికితేకాని సూర్యం చేతికి అది తగల్లేదు. పావలాను చేతితో పట్టుకుని మైదానం వైపు పరుగెత్తాడు సూర్యం. సోడా గొంతులో పోసుకోవాలన్న ఆతృతతో షాపువైపు పరుగెత్తే సూర్యానికి ఎదుటి దిక్కులో బస్సు అందుకోవాలని వడివడిగా వస్తున్న ఒక పెద్దమనిషి ఢీకొనడంతో సూర్యం చేతిలోని పావలా మైదానంలో ఉన్న యిసుక దిబ్బల్లో జారిపడింది. వారానికి సరిపెట్టుకునే సూర్యం పావలా ఇసుక దిబ్బలపాలైంది. చాలా బాధపడ్డాడు సూర్యం. ఇసుక దిబ్బల్లో కాళ్ళు కాలుతున్నాయి. నెత్తి మాడిపోతోంది. గొంతు ఆరిపోతోంది. పెద్దమనిషి తనకు డాష్ ఇచ్చినచోట పావలాకోసం కనురెప్పవేయకుండా వెతుకుతూ ఇసుకదిబ్బల్లో చతికిలబడ్డాడు సూర్యం. పైన విమానాల మోత. అల్లంత దూరాన రోడ్లమీద ఏఆర్పీ భటుల విజిల్స్. వాహనాల ధ్వని. ఇసుకదిబ్బల్లో సూర్యం వెదుకుతూ ఉండడం చాలామంది కంటబడింది. ఒక్కొక్కరు సూర్యం చుట్టూ చేరారు. అలా అక్కడకు చేరిన చాలామంది చూస్తూ నిలబడ్డారు.

"ఏవిటి బాబూ! చాలాసేపటి నుంచి వెదుకుతున్నావ్. ఏవిటిపోయింది?" అడిగాడు అందులో ఒక పెద్దమనిషి.

"పాపం, చాలా చిన్నపిల్లవాడు, ఏదో పారేసుకున్నట్టున్నాడు. చెప్పుబాబూ.. ఎంతసేపని ఎండలో వెతుకుతావు. మేము కూడా సాయపడతాం.. ఏవిటి పారేసుకున్నావో చెప్పు" ఒక బట్టతల మనిషి ముందుకొచ్చాడు.

'పావలా'– అని చెప్పాలనుకున్నాడు సూర్యం. ఆమాట నాలిక చివరివరకు వచ్చింది. పావలాకోసం ఇంత ఎండలో చెప్పులు లేకుండా, కాలుకాలుతూ ఉన్నా పట్టించుకోకుండా వెతుకుతారా? అని ఎవరైనా అంటారు. కాని ఆ పావలా తనకు ఒక వారానికి సరిపడే పాకెట్‌మనీ అని ఎవరికి తెలుసు? పావలా అని చెప్పటానికి సూర్యం సిగ్గుపడ్డాడు. కాని ఏదో సమాధానం చెప్పాలి. చెప్పకపోతే జనం ఊరుకునేటట్టు లేరు. అప్పటికే జనం తలోరకంగా అనుకుంటున్నారు. కొందరు సానుభూతి చూపిస్తున్నారు. మరికొందరు విమర్శిస్తున్నారు.

అక్కడ చేరిన జనాన్ని చూసి ఏదో జరగకూడనిది జరి

గిపోయిందని పోలీస్ కానిస్టేబుల్ త్రీనాట్టూ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

''ఏమిటిదంతా- ఏం జరిగిందక్కడ?'' లాఠీ ఊపుతూ కేకలేసాడు త్రీనాట్టూ.

''ఏమీ జరుగలేదు బాబూ- ఆ అబ్బాయి ఏదో పారేసుకున్నాడు. ఇసుకలో వెదుకుతున్నాడు'' చెప్పాడు జనంలో ఒకడు.

''చూడు బాబూ, నాకు చెప్పు. ఏవిటి పారేసుకున్నావ్?'' అన్నాడు త్రీనాట్టూ.



అంతలో పోలీస్ జీప్ వచ్చి అక్కడ ఆగింది. జనం అంతా జీప్‌వైపు తిరిగారు.

ఇనస్పెక్టర్ విల్సన్ జీప్ నుంచి దిగాడు.

''వాట్ హేపండ్- ఏమ్టి జరిగిందక్కడ? త్రీనాట్టూ నువ్వు ఇక్డ ఉండి ఏమ్టి పట్టించుకోలేదా? నేను అప్డే చెప్పాను- నువ్వొట్టి దద్‌మవి. మూడ్ నెలలైంది, నాట్ యీవెన్ సింగిల్ కేస్- ఒక్కకేసు పట్కున్నావా? లేదు- నువ్వు పట్కోలేవు.''

ఇనస్పెక్టర్ విల్సన్‌కి మంచి అవకాశం దొరికింది. కానిస్టేబుల్ త్రీనాట్టూకి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చాడు.

అరగంట నుంచి ఎండలో వెతుకుతున్న సూర్యానికి ప్రపంచం అంతా పచ్చగా ఉన్నట్టు అనిపించింది. ఏదో ఒకటి చెప్పకపోతే జనం తనని బ్రతకనిచ్చేటట్టులేరు.

''చెప్పుబాబూ, చెప్పు, ఏమ్టి పారేష్‌కున్నావ్?'' సూర్యం ప్రక్కన నిలబడి అడిగాడు విల్సన్.

''ఉంగరం'' అన్నాడు సూర్యం. తను చెప్పినది అబద్ధం అన్నసంగతి అతనికి తెలుసు.

ఆ క్షణాన అలా చెప్పడం తప్ప మరోదారి అతనికి కనబడలేదు.

''ఉంగరమా- బంగారానిదే!'' జనంలో ఒకడు ఆశ్చర్యంగా అడిగాడు.

''భలేవాడివిరా- చిట్టిబాబు వ్రేలికి బంగారానిది కాకపోతే ఇత్తడి ఉంగరం పెడతార్రా, బుర్రలేని వెధవ?'' అన్నాడు మరొకడు.

'చూడెన్‌డీ- మీరు ఊర్కుంట్రా.. చిట్‌బాబ్ ఉంగ్రం పారేస్కుంటే మీక్ జోక్‌గా ఉందా? బాబ్ నీ పేరేమ్టి?'' అడిగాడు ఇనస్పెక్టర్ విల్సన్.

''సూర్యం.''

''మైడియర్ బాయ్- డోంట్‌వర్రీ. అయామ్ హియర్. నీళ్ళాంటివోల్ పారేస్కోవాలి, మేము వాట్ని ఆషూకి తెల్సుకోవాలి. దటీజ్ అవర్ డ్యూటీ.. ఓ.కే.. త్రీనాట్టూ!'' పిలిచాడు ఇనస్పెక్టర్ విల్సన్.

''యస్సార్..'' ఇనస్పెక్టర్ ఎదుట నిలబడ్డాడు త్రీనాట్టూ.

''నేను ఇదివర్కే షెప్పానా- నువ్వొట్టి దద్‌మవని. మూడ్నెల్లు- త్రీమంత్స్ అయింది, ఒక్క కేసైనా పట్కున్నావా? నో.. లేదు. ఈ బుజ్జిబాబు- పేరు షూర్యం. ముద్దొస్తున్నాడు కదూ! పాపం, రింగ్ పారేష్‌కున్నాడు. ఆరాతీయ్, ఎక్కడ పారేష్‌కున్నాడో శోకించు- సారీ-పరిషోధించు.

ఈకేషైనా ఇన్వెస్టిగేట్ చేయకపోతే నీకు ప్రమోషన్ జీరో.. అంతే కాదు- అండమాన్ ట్రాన్స్‌ఫర్ చేయమని ఐజీకి నోట్ పుటప్ చేస్తాను. అండర్‌స్టాండ్!'' ఇనస్పెక్టర్ విల్సన్ పులిలా గర్జించాడు.

కాన్‌స్టబల్ త్రీనాట్టూ గంగిరెద్దులా తలూపాడు.

''హలో, నగరపౌరులూ, ఇంకో యిర్వై నిముషాల్లో ఏర్‌రైడ్ జరిగితే జరగవచ్చు. ఏఆర్పీవాళ్ళ వార్నింగ్ మీరు వినలేదా? వెళ్ళండి, యిక్డ ఉండిపోకండి. రన్..



## చీప్ గిఫ్ట్

రెండోసారి కల్సినప్పుడు ''రాణీ! నీకో మాంచి గిఫ్ట్ ఇద్దామనుకుంటున్నా!'' అన్నాడు రాజు.

''ఏమిటది?'' అని కుతూహలంగా అడిగింది రాణి.

''నన్ను నేనే నీకు గిఫ్ట్‌గా ఇద్దామనుకుంటున్నా!''

''ఛీ! అంత చీప్‌గిఫ్ట్ ఇద్దామని అలా ఎలా అనుకున్నావ్?'' అంది రాణి చివాట్లేస్తూ.

## ప్రేమ ఫలితం

ఓ పెద్ద దెబ్బలాట తర్వాత ''నిన్ను పెళ్ళాడినప్పుడు నిజంగా నాకు బుద్ధి ఉండి వుండదు'' అన్నాడు సుబ్బారావు.

''నేను మీ ప్రేమలో పడ్డానుగా! మీకు బుద్ధి లేదన్న సంగతి నాకూ తెలియలేదు మరి!'' అంది సుందరి సుతారంగా నవ్వుతూ.

**- తటవర్తి రామచంద్రరావు (న్యూఢిల్లీ)**

## ప్రార్థిస్తాను

''ఒకవ్యక్తి నీ దగ్గరికి వచ్చి నమ్మకంగా వెయ్యి రూపాయిలు నీవద్ద ఉంచి వెళ్లిపోయాడు... ఆ తర్వాత అతను చనిపోయాడనుకో... నువ్వేం చేస్తావ్?''

''దేవుణ్ణి ప్రార్థిస్తాను.''

''పాపం వాడి చిరునామా కోసమా?.. వాడి ఆత్మశాంతికా!!''

''అంత పెద్దమనసు నాకు లేదు.''

''మరి''

''తరుచూ అలాంటి వ్యక్తుల్ని పంపి డబ్బు అందజేయమని.''

?!?!

**- తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి (హైదరాబాద్)**

రన్... ఇద్గో- త్రీనాట్! షూర్యం దగ్గర నుంచి కంప్లైంట్ తీసుకో. కేస్ నీకు వొప్పజెప్తున్నాను. ఓ.కె. వారంరోజులు టైమ్. ఈటైమ్‌లో కేసు శోకించక- సారీ- పరిషోదించకపోతే ఏం జరుగుతుందో నీకు తెల్సుకదా! అండమాన్ దీవులు గుర్తుంచుకో..'' విల్సన్ ఎక్కి కూర్చున్న మోటార్‌సైకిల్ బుర్రుపిట్టలా తుర్రుమంది.

సెకెండ్ వార్నింగ్ అనుకుంటా- మళ్లీ సైరన్ మోత చెవిలో తుప్పును పోగొట్టినట్టుంది.

''ఇదిగో సూర్యం బాబూ, కంప్లైంట్ రాశాను.. ఈ కాగితం మీద సంతకం చెయ్యి'' కాగితం, పెన్ను సూర్యం చేతిలో పెట్టాడు కాన్‌స్టబల్ త్రీనాట్‌టూ.

సంతకం పెట్టి, కాగితం, పెన్ను త్రీనాట్‌టూకి ఇచ్చాడు సూర్యం.


''సూర్యం! నువ్వు విచారించకు, నేనున్నాను. నీ ఉంగరం తప్పక దొరుకుతుంది. నీ ఉంగరం దొరక్క పోతే నేను ఈ ఊర్లో ఉండను. నేను ఈకేసు దర్యాప్తు చేయలేకపోయాననుకో- నావీపు- అదే, పైన ఎగిరిపోతున్న విమానంమోత విన్నావుగా- అలా అయిపోతుంది. ఇనస్పెక్టర్ విల్సన్‌ని చూశావుగా, అతను ఇంగ్లాండ్ నుండి సరాసరి ఈ ఊరువచ్చి నాకు మొగుడై కూర్చున్నాడు. చండశాసనుడు. అదిగో, ఆకాశంలో మళ్ళీ విమానం మోత, ఏం బ్రతుకులో.. నేను పోలీస్ స్టేషన్‌కు వెళితే నావీపు విమానంమోత అయిపోతుందేమోనన్న భయం, పోయిన ఉంగరం సంగతి నువ్వు యింట్లో చెబితే వీపు విమానంమోత అయిపోతుందేమోనని నీకు భయం. కంప్లైంట్ ఇచ్చావుగా, నువ్వు యింటికి వెళ్ళు. నేను చూసుకుంటాను.. అదిసరే, నువ్వెక్కడ ఉంటున్నావ్?'' అడిగాడు త్రీనాట్‌టూ.

''కొత్తగ్రహారం, రెండోవీధిలో'' చెప్పాడు సూర్యం.

''అంటే మావీధికి ముందు గల్లీలోనే! ఏయిల్లు?''

''పోస్టబాక్స్‌కు ప్రక్కనున్న యిల్లు.''

''అరేబడవా! ఇద్దరం ఒకే దగ్గరుంటున్నాం. మేమున్నది మూడోవీధిలో, నువ్వున్నది రెండో వీధిలో. మాయింటి పెరటిగుమ్మం, మీయింటి పెరటి ద్వారం ఎదురెదురుగా ఉన్నాయన్నమాట. మరేం ఫర్వాలేదు. నువ్వు యింటికెళ్ళు. నేను సర్కిల్ ఆఫీసుకెళ్ళి పనిచూసుకువస్తాను. నీ ఉంగరం వెతికి తెచ్చే భారం నాది.''




అంటూ సైకిలెక్కి సర్కిల్ ఆఫీసుకు వెళ్ళాడు త్రీనాట్‌టూ.

కాన్‌స్టబల్ త్రీనాట్‌టూకి తలిదండ్రులు పెట్టిన పేరు రామస్వామి. కాని రామస్వామి ఎక్కడున్నాడంటె ఎవరూ చెప్పలేరు. త్రీనాట్‌టూ ఉన్నాడా అంటే యిట్టే ఎవరైనా చెబుతారు. ఆ రాత్రి కాన్‌స్టబల్ రామస్వామికి నిద్రపట్టలేదు. మూడ్నెలలబట్టి ఒక్కకేసు కూడా అతను పట్టుకోలేదు. అందుకే, ఇంగ్లాండ్ నుండి డైరక్ట్‌గా వచ్చిన ఇనస్పెక్టర్ విల్సన్ అగ్గిమీద గుగ్గిలం అయిపోతున్నాడు. మాటి మాటికి అండమాన్ పంపించేస్తానని బెదిరిస్తున్నాడు.

ఇనస్పెక్టర్ విల్సన్ అనవసరంగా తన్పై మండిపడతాడు కాని- దొంగలు దోపిడీ చేస్తారు- అది తప్పే మరి. దొంగల్ని దండించాలి- అది నిజమే- వారు పట్టుబడితే కదా దండించాలి. పట్టుబడాలంటే దొంగలు పోలీసులకు దొరకాలి కదా! మరి ఆ దొంగలు పోలీసుల కంటబడకుండా తప్పించుకు పారిపోతుంటే, వారిని పట్టుకుని, కేసు పెట్టాలని అంటాడేవిటండీ ఇనస్పెక్టర్ విల్సన్. వీడెక్కడ దొరికాడండీబాబు నా ప్రాణానికి- రాత్రి మంచం మీద అటు యిటు ఎన్నిసార్లు దొర్లినా కాన్‌స్టబుల్ రామస్వామికి నిద్రపట్టలేదు. బ్లడీ- బ్లడీ అని ఇనస్పెక్టర్ ప్రయోగించిన మాటలు తుపాకిలోని తూటాల్లా రామస్వామి గుండెల్లోకి దూసుకుపోతుంటాయి. దొరల పరిపాలన ఎప్పుడు పోతుందో.. మహాత్ముడు కలలుగన్న స్వాతంత్ర్యం ఎప్పుడొస్తుందో?- తెలీదుకాని, తను ఉంగరం ఆచూకి తెలుసుకుని, ఉంగరాన్ని సూర్యానికి ఇవ్వకపోతే మకాం అండమాను దీవులకు మార్చక తప్పదు. మంచంమీద రామస్వామి దొర్లుతూ ఉన్నాడు. అదేమంచం మీద మరోప్రక్క రామస్వామి భార్య ప్రశాంతంగా నిద్రపోతోంది. ఆమెకు ఇలాంటి టెన్షన్‌లేదు. ఆ ఇద్దరి మధ్య రామస్వామి సుపుత్రుడు పవన్‌కుమార్ పడుకుని ఉన్నాడు. ఆరేళ్ళ పవన్‌కుమార్ పదేళ్ళ వయసులో ఉన్నట్టు కనిపిస్తాడు. ఆరాత్రి డిమ్‌లైటు వెలుతుర్లో పవన్‌కుమార్ చూపుడివేలికి తొడిగిన బంగారు ఉంగరం తళతళ మెరిసింది. అది కంటబడగానే రామస్వామి మెదడులో మెరపులాంటి ఆలోచన తళుక్కుమంది. పవన్‌కుమార్ చేతిలోని ఉంగరం కాజేసి తెల్లారగానే సూర్యం దగ్గరకు వెళ్ళి- 'సూర్యంబాబూ నీ ఉంగరం దొరికింది' అని ఉంగరాన్ని అతని చేతిలోపెడితే సూర్యం ఆనందానికి అవధులుండవు. తను అండమాన్ వెళ్ళవలసిన అవసరం ఉండదు.. మూడు నెలలబట్టి ఒకకేసు పట్టకపోయినా ఇప్పుడు ఒక మంచిపనిచేశావు, షూర్యం రింగ్ ఆషూకి తెల్సుకుని వాడి రింగ్ వాడ్కి వొప్పచెప్పావ్- అంటూ విల్సన్ తన తలమీద పెద్ద కిరీటం పెడతాడు తన భుజం తట్టి. ప్రమోషన్ కోసం తన పేరు రికమండ్ చేసినా చేస్తాడు- రామస్వామి టెన్షన్‌ఫ్రీగా ఫీలయాడు. మర్నాటి కార్యక్రమం గురించి ఆలోచిస్తూ ఆరాత్రి హాయిగా నిద్రపోయాడు.

• • •

తెల్లవారగానే లేచి హుషారుగా కాలకృత్యాలు తీర్చుకుంటున్న భర్తను చూసి చాలా ఆశ్చర్యపోయింది రామస్వామి భార్య జానకమ్మ. స్నానం పెట్టి స్కూలుకు పంపాలన్న ఉద్దేశంతో సుపుత్రుడు పవన్‌కుమార్‌కు

తలంటి, చేతులకు సబ్బు పెడుతుండగా వాడి చూపుడు వ్రేలికి ఉండవలసిన ఉంగరం జానకమ్మ కంటికి కనబడలేదు. ఉంగరం కనబడలేదండీ అంటూ లబోదిబోమంది ఆమె. ''పోలీస్ కాన్‌స్టబల్ రామస్వామి యింట్లో ఉండగా నీకెందుకే ఆ బెంగా! నేను చూసుకుంటాను, నువ్వు ధైర్యంగా ఉండు.'' అని భార్యకు హితోపదేశంచేసి, సైకిల్ పుచ్చుకుని అగ్రహారం రెండోవీధికి బయల్దేరాడు రామస్వామి. వాళ్ళ పెరటి గుమ్మానికి ఎదుటఉన్న యింటికి వెళ్ళడానికి సైకిల్‌మీద వెళ్ళవలసిన పనిలేదు. డ్యూటీ మీద తను ఎక్కడికో వెళ్తున్నట్టు భార్య అనుకోవాలని రామస్వామి సైకిల్ పుచ్చుకుని సూర్యం యింటికి వెళ్ళాడు.

రామస్వామి తను తెచ్చిన ఉంగరాన్ని సూర్యానికి చూపించాడు. ఇసుక దిబ్బల్లో పారేసుకున్న ఉంగరం అదే అని చెప్పాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇనస్పెక్టర్ విల్సన్‌కు కనిపించి ఆ ఉంగరం తీసుకోవచ్చునని చెప్పాడు. సూర్యం ఆ ఉంగరాన్ని చూశాడు. అది తన ఉంగరం కాదని అనలేకపోయాడు. తనది కాదని చెబితే 'పోయిన నీ ఉంగరం ఎలా ఉంటుంది' అని రామస్వామి వెంటనే ప్రశ్న వేస్తాడు. అందుకే మాటాడకుండా ఉండిపోయాడు సూర్యం.

ఆరోజు మధ్యాహ్నం స్కూలు విడిచిపెట్టినప్పుడు సూర్యం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళడం, ఇనస్పెక్టర్ విల్సన్ ఆ ఉంగరాన్ని సూర్యానికి అందించడం జరిగాయి. సూర్యం అక్కడ ఉండగానే విల్సన్, రామస్వామి భుజంతట్టి- కీపిటప్, మైడియర్ ఫ్రండ్'- అనేసరికి రామస్వామి సంతోషం పట్టలేకపోయాడు. విల్సన్ అప్పటివరకు త్రీనాట్ టూ అని పిలవడమేకాని ఫ్రండ్ అని ఎప్పుడూ అనలేదు.

కొడుకు ఉంగరం పోయిందన్న దిగులుతో రామస్వామి భార్య జానకమ్మ నాలుగురోజుల నుండి తృప్తిగా భోజనం చేయలేకపోయింది. డాక్టర్‌కు జబ్బు రావడం, పోలీసుల యింట్లో వస్తువులు పోవడం, లెక్చరర్ కొడుకు పరీక్ష తప్పడం- యిటువంటివి ఎప్పుడూ జరుగవు, జరుగకూడదని జానకమ్మ నమ్మకం. మరి తనకొడుకు ఉంగరం ఎలాపోయింది?- అదే విషయాన్ని నిలదీసి అడిగింది భర్త రామస్వామిని. ఈవిషయం గురించి భార్యభర్తల మధ్య రోజూ పోట్లాట జరుగుతూ ఉంది. ఒకరోజు తెల్లవారు జామున వారి పెరట్లో రామస్వామి, జానకమ్మ ఒకరిపై మరొకరు కేకలేసుకుంటున్నారు. అప్పుడే వారి పెరటికెదురుగా ఉన్న యింట్లో సూర్యం లేచి టాయ్‌లెట్లో కాలకృత్యాలు తీర్చుకుంటున్నాడు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఆకాశంలో విమానాలమోత వినబడలేదు. రోడ్డుమీద వాహనాలు పరుగెత్తలేదు. ఏఆర్పీ భటులు ఇంకా వారి వారి విధులకు హాజరైనట్టులేదు. నిశ్శబ్దం రాజ్యం చేస్తున్న ఆ ప్రదేశంలో రామస్వామి, జానకమ్మల సంభాషణలోని ప్రతి మాట సూర్యం చెవిలో పడకుండా పోలేదు.

సూర్యం అనే ఒక అబ్బాయి స్కూలు నుండి వస్తూ ఉంగరాన్ని పోగొట్టుకోవడంతో ఆకేసు యిన్వెస్టిగేషన్ తన తలపై పడిందని, ఆ ఉంగరం వారంరోజుల్లో ట్రేస్ చేసి సూర్యానికి ఇవ్వకపోతే తనకు అండమాన్ దీవులకు బదిలీ చేస్తానని ఇనస్పెక్టర్ విల్సన్ వార్నింగ్ ఇవ్వడంతో కొడుకు ఉంగరం కాజేసి, తను ఆ ఉంగరాన్ని సూర్యానికి ఇచ్చానని, ఇది తన మంచికోసమే చేశానని భార్య జానకమ్మకు రామస్వామి చెప్పగా సూర్యం విన్నాడు. కొడుకు ఉంగరం కోసం రామస్వామి భార్య ఎంత బాధపడుతున్నది పెరటి ద్వారం నుండి సూర్యం కళ్ళారా చూశాడు.

ఆరోజు సూర్యం స్కూలుకు వెళుతూ కొత్తగ్రహారం మూడోవీధిలో ఉన్న రామస్వామి ఇంటికి వెళ్ళాడు.

''ఏంబాబూ, యిలావచ్చావ్. ఇంకా స్కూలుకు వెళ్ళలేదా?'' అడిగాడు రామస్వామి.

''మరేంలేదు, మీతో రెండు నిముషాలు మాట్లాడాలి. ఇలా కూర్చోవచ్చా?'' అన్నాడు సూర్యం.

''కుర్చీలో కూర్చోడానికి నా పర్మిషన్ కావాలా? భలే వాడివే, కూర్చో, కూర్చో.''

సూర్యం కుర్చీలో కూర్చోగానే మఫ్టీలోవున్న కాన్‌స్టబుల్ రామస్వామి అతని ప్రక్కనే కూర్చున్నాడు.


''సార్, నేను పారేసుకున్నది పావలా. ఉంగరం కాదుసార్. ఆరోజు నా చుట్టూచేరిన జనం, ఏం పారేసుకున్నావ్, ఎండలో వెతుకుతున్నావ్ అని అడగ్గానే పావలా పారేసుకున్నాను అని చెప్పటానికి సిగ్గేసింది సార్. అందుకే ఉంగరం పోయిందని అబద్ధం చెప్పానుసార్. అబద్ధం ఎప్పుడూ చెప్పనుసార్. ఈసారి తప్పయిపోయిందిసార్. ఈ ఉంగరం మీ అబ్బాయికిచ్చేయండి సార్.'' తన చేతిలో ఉన్న ఉంగరాన్ని రామస్వామి చేతిలో పెట్టాడు సూర్యం.

''బాబూ సూర్యం, చిన్నవాడివైనా నువ్వు చాలా బుద్ధిమంతుడివి. మంచి తెలివైనవాడివని మీ మాష్టారు చెప్పారు. అయితే దీన్లో నీ తప్పులేదు. నా స్వార్థంకోసమే నేను ఈ నాటకం ఆడాను. నువ్వు ఇచ్చిన ఈ ఉంగరం నాది అని నేననుకోను. నువ్వు నాకిచ్చిన వరంగా నేను స్వీకరిస్తాను. దీనివలన పదేళ్ళ నా సర్వీసులో ఎప్పుడూ నాకు లభించని గౌరవం నేను పొందాను. నీలాంటివాళ్ళు మనదేశానికి ఎంతో అవసరం. నువ్వు నాకళ్ళు తెరిపించావు. చచ్చినా యిటుపై నేను తప్పుడు కేసులు పట్టుకోను. తప్పుడు సాక్ష్యాలు ఇవ్వను. నీకు ఎప్పుడు అవసరం వచ్చినా ఇక్కడ నేనున్నానని మరచిపోకు. భగవంతుడు నిన్ను తప్పక కాపాడుతాడు'' అన్నాడు రామస్వామి.

''నమస్కారం సార్. వెళ్ళొస్తాను'' అంటూ రామస్వామి యింటి నుంచి బయటకు వచ్చి స్కూలువైపు నడిచాడు సూర్యం.

★

## జాక్సన్ టేపులు



మైఖేల్ జాక్సన్ అంటే ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మాండమైన క్రేజ్ వుందని మనకు తెలిసిందే. ఆ క్రేజును క్యాష్ చేసుకుందామని కొందరు ప్లాన్ చేసి మైఖేల్ జాక్సన్‌కు సంబంధించిన ఫ్యామిలీ వీడియో టేపులు దొంగిలించారు. లక్ష డాలర్లు ఇస్తేగనుక ఆ టేపులు ఇచ్చేస్తామని బేరంపెట్టారు. జాక్సన్ ఇవ్వనుపొమ్మన్నాడు. సరే ఇలా వుందని దొంగలు ఆ టేపులు వీడియో ఛానల్స్ వాళ్ళకు అమ్మేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎవరైనా ఆ టేపులు కొని టెలీకాస్ట్ చేస్తే భారీఎత్తున పరువునష్టం వేస్తానని మైఖేల్‌జాక్సన్ బెదిరించటంతో ఎవ్వరూ ఆ టేపులు కొనేందుకు ముందుకు రావటంలేదు. దాంతో సదరు దొంగల పరిస్థితి పిచ్చికామెడీగా మారింది.

## హైట్‌ప్రాబ్లం

బీహార్‌లో ఓ సెంటర్‌లో ప్రైమరీ టీచర్ సెలక్షన్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇన్విజిలేటర్‌కు డౌటొచ్చి పరీక్ష వ్రాస్తున్న ఒకామెను పైకిలేపాడు. హాల్‌టిక్కెట్, ఫోటో అన్నీ సక్రమంగానే వున్నాయి కానీ సంతృప్తి చెందని ఆయన పోలీసులకు ఫోన్‌చేసాడు. దాంతో ఇద్దరు లేడీ కానిస్టేబుల్స్ పరీక్ష హాల్లోకి వచ్చి సోదా చేయగానే విషయం తేలిపోయింది. అసలు విషయం ఏమిటంటే అభయ్‌కుమార్ అనే వ్యక్తి తన భార్య బదులుగా స్త్రీవేషం వేసుకుని పరీక్ష వ్రాస్తుండగా అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్ పట్టుకున్నాడు. ఆవిడ ఆరు అడుగుల ఎత్తుండేసరికి నాకు అనుమానం వచ్చింది. అన్నాడాయన. లేడీ కానిస్టేబుల్స్ అభయ్‌కుమార్ కట్టుకున్న చీర, నెత్తిమీద విగ్ తీసేసరికి హాల్లో పరీక్ష వ్రాస్తున్న మిగతా స్త్రీ అభ్యర్థులు బిత్తరపోయారు.

\- అట్లు రవికుమార్

